క్లుప్తంగా

ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పద్మనాభం: ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం 18 నుంచి 25 ఏళ్ల లోపు అర్హులైన అభ్యర్థులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్‌లో శిక్షణకు అభ్యర్థులు ఇంటర్ ఉత్తీర్ణులు కావాలని పేర్కొన్నారు. బ్రైడల్, ఫ్యాషన్ అండ్ పోర్ట్‌ఫోలియో మేకప్ ఆర్టిస్ట్ శిక్షణకు ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ప్రొడక్షన్ మెషీన్ ఆపరేటర్‌కు ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, బీఎస్సీ కెమిస్ట్రీ, ఐటీఐలో ఉత్తీర్ణులైన వారు, జనరల్ డ్యూటీ అసిస్టెంట్‌కు పదో తరగతి, ఇంటర్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. ఆస్పత్రి బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్ శిక్షణ కోసం గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి మెప్మా ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలియజేశారు. మిగతా వివరాలకు 79930 11605 నంబరులో సంప్రదించాలని కోరారు.

జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు అవగాహన



జీఎస్టీ తగ్గింపుపై ప్రచారం చేస్తున్న చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

తగరపువలస: జీఎస్టీ తగ్గింపుపై చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి మాట్లాడుతూ ప్రజలపై భారం తగ్గించి, నాణ్యమైన వస్తువులు అందించేందుకు కేంద్రప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందన్నారు. తమ అవసరాలకు సరిపడా ఉత్పత్తులు మాత్రమే కొనుగోలు చేసుకోవడం ద్వారా అందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. 99 శాతం వస్తువులు పన్నురహితంగా ఉండగా మిగిలిన వాటిపై 5 శాతం లేదా 18 శాతం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆదాయ వ్యయాలను సమతుల్యం చేసుకుంటూ ఆర్థిక ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిప్పాడ సచివాలయం నుంచి వై.ఆశాలత, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ ఉత్సవాలు ప్రారంభం

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో సుంకర వారి కుటుంబ సభ్యుల ఇలవేల్పు బంగారమ్మ ఉత్సవాలు సోమవారం తొలేళ్లతో ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ప్రతిమలైన ఘటాలను రాత్రి గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యంగా అన్నాన్ని ఘటాల్లో వేసి, తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

60 మందికి దంత వైద్య పరీక్షలు

తగరపువలస: ఆనందపురం మండలం గొట్టిపల్లి శ్రీసత్యసాయి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరంలో సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల సిబ్బంది సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 60 మంది సేవలు అందుకున్నారు. కార్యక్రమంలో డబ్బీరు విజయకుమార్, కోరాడ నాయుడు బాబు, కోరాడ తమ్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్‌పూలింగ్‌పై గ్రామసభ

పద్మనాభం: కొవ్వాడ ల్యాండ్‌పూలింగ్‌లో అనుభవదారులు అభ్యంతరాలుంటే నెల రోజుల్లోగా తమకు తెలియజేయాలని తహసీల్దార్ కె.ఆనందరావు తెలిపారు. మండలంలోని పాత కొవ్వాడలో ల్యాండ్ పూలింగ్‌పై సోమవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. సర్వే నంబర్ 237లో 230 ఎకరాల భూమి ఉందన్నారు. అనంతరం గ్రామ సభలో అనుభవదారులు అసైన్‌మెంటు భూమి వివరాలను ప్రకటించారు.

ప్రత్యామ్నాయం చూపకుండా బళ్లు తొలగించమంటే ఎలా?

మధురవాడ: హాకర్స్ జోన్లు ఏర్పాటు చేసి, లేదా ప్రత్యామ్నాయ ఉపాధి చూపించేంత వరకు రోడ్ల పక్కన తోపుడు బండ్ల ద్వారా వ్యాపారం చేసుకోవడానికి అనుమతిస్తామని చెప్పిన జీవీఎంసీ అధికారులు ఇప్పుడు మాట మారిస్తే ఎలా అని సీఐటీయూ నాయకుడు పి.రాజ్‌కుమార్ ప్రశ్నించారు. దీనిపై జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మికి సీఐటీయూ అనుబంధ విశాఖ తోపుడు బండ్లు, చిల్లర వర్తకులు సంఘం ఆధ్వర్యంలో నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ట్రాఫిక్, పాదచారులకు ఇబ్బంది లేకుండా రోడ్డు పక్క ఖాళీ స్థలాల్లో తోపుడు బళ్లు పెట్టుకుని జీవనం సాగిస్తున్న వారిని కూడా బండ్లు తీసేస్తామని సచివాలయ కార్యదర్శులు వచ్చి బెదిరిస్తున్నారన్నారు. ప్రత్యామ్నాయం చూపేవరకు ఉన్న చోటే బళ్లు ఉంచాలని కోరారు. యూనియన్ నాయకులు ఆదినారాయణ, వరలక్ష్మి, ధనుంజయరావు పాల్గొన్నారు.



గొల్లల తాళ్లవలస హైవేపై చీకట్లు



సంగివలస జాతీయరహదారిపై పాక్షికంగా వెలుగుతున్న లైట్లు



వెల్లంకి జాతీయరహదారిపై అంధకారం

హైవేపై అంధకారం



తాళ్లవలస పెట్రోల్ బంకు వద్ద అలముకున్న అంధకారం

- అలంకారప్రాయంగా వీధిలైట్లు
- కొన్నిచోట్ల స్తంభాలే లేని వైనం
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



సంగివలస అండర్‌పాస్‌లో వెలగని లైట్లు

తగరపువలస: భీమిలి, ఆనందపురం **మండలాల** పరిధిలో హైవేపై అంధకారం నెలకొం**ది. భీమిలి** మండలం గొల్లల తాళ్లవలస నుంచి **ఆనందపురం** మండలం పెద్దిపాలెం, వెల్లంకి పంచా**యతీల వరకు** జాతీయరహదారి, సర్వీస్‌రోడ్లు, **అండర్‌పాస్‌ల** ద్వారా చీకటి పడితే రాకపోకలు చాలా **కష్టంగా ఉం**టోంది. కొంతకాలంగా ఈ ప్రాంతాల్లో **వెలగని లైట్ల** కారణంగా చిమ్మ చీకట్లు అలముకుంటు**న్నాయి.**

వాహనాల ద్వారా సొంతంగా లైట్లు **వేసుకుని** రావడం తప్ప వేరే మార్గం లేదు. జా**తీయరహదా**రికి ఇరువైపులా, డివైడర్‌పై ఉన్న **విద్యుత్ స్తం**భాలు, లైట్లు పేరుకు మాత్రమే ఉన్నాయి. మిగిలిన చోట్ల లైట్లు వెలుగుతున్నా, రాత్రి వేళ అవి ఎప్పుడు వెలుగుతాయో, ఎప్పుడు ఆరిపోతాయో హైవే అధికారులకే తెలియాలి. దీంతో ఈ చీకటి రహదారులు దాటే పాదచారులు, ముందుకు వెళ్లే చిన్న వాహనాలు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నాయి.

స్తంభాలే లేవు

వాస్తవానికి తాళ్లవలస పంచాయతీలో పెట్రోల్ బంకు నుంచి ఫ్లై ఓవర్ వరకు పేరుకైనా విద్యుత్ స్తంభాలే లేవు. దీంతో ఈ ప్రాంతంలో ఎడమ, కుడి రహదారులలో ఎదురెదురుగా వచ్చే వాహనాల యాజమానులు సైతం కంటికి వాహనాల లైటింగ్ ఫోకస్ తగిలి అయోమయానికి గురవుతున్నారు. **ఇటీవల యజమానులు నిబంధనలు అతిక్రమించి రంగురంగుల ఎల్ఈడీ లైట్లు వాహనాలకు అమర్చి మరిన్ని ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇక వెల్లంకి, పెద్దిపాలెం, గొల్లల తాళ్లవలస గ్రామాలలో అయితే సర్వీస్ రోడ్లపై కూడా రాకపోకలు సాగించలేనంత చీకటిగా ఉంటున్నాయి.**

మలుపులు, ఎత్తు పల్లాలతో మరింత ప్రమాదం

ఆనందపురం ఫ్లై ఓవర్ కింద నుంచి వేగంగా వచ్చే వాహనాలు వేములవలస వద్ద మలుపుతో కూడిన పల్లపు రహదారిపైకి ఒక్కసారిగా దూసుకురావడంతో తరచూ గోకార్టింగ్ కూడలి వద్ద ప్రమాదాలు జరిగి ద్విచక్రవాహనదారులు మరణిస్తున్నారు. అలాగే తగరపువలస వైపు నుంచి విశాఖ వెళ్లే వాహనదారులు కూడా మలుపులో నిలిపి ఉన్న వాహనాలను గమనించక ఢీకొట్టి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. పెద్దిపాలెం ఫ్లై ఓవర్ నుంచి తాళ్లవలస మీదుగా వలందపేట వరకు రెండు ప్రమాదకరమైన మలుపులు, పల్లానికి వేగంగా వచ్చే వాహనాల కారణంగా కూడా వీటి మధ్య మూడు ప్రమాదకరమైన స్పాట్లు ఉన్నాయి. **వలందపేట, తాళ్లవలస కూడలిలో లైట్లు వెలుగుతున్నా గొల్లల తాళ్లవ**లస, పెట్రోల్ బంకు, అగ్నిమాపక కేంద్రం వద్ద రహదారిపైనా, సర్వీస్‌రోడ్లపైనా లైట్లే వెలగడం లేదు. కనీసం ప్రమాదాల నివారణకు తాత్కాలికంగా స్టాపర్లు అయినా ఏర్పాటు చేయాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా, తగరపువలస నుంచి ఆనందపురం మధ్యలో పలుచోట్ల హోటళ్లు, దాబాలు ఉన్నందున సరకు రవాణా వాహనాల కార్మికులు రోడ్లపక్కనే వాహనాలు నిలిపి అల్పాహారానికి వెళ్లడం, విశ్రాంతి తీసుకోవడం చేస్తుంటారు. వీరు వాహనాలు నిలుపుకొనేందుకు ప్రత్యేకంగా ట్రక్ బే లైన్ లేకపోవడం గమనార్హం.



పెద్దిపాలెం ఫ్లై ఓవర్ కింద కటిక చీకటి

రోడ్డు దాటాలన్నా సమస్యే..



జాతీయరహదారిపై వచ్చీ **పోయే వేలా**ది వాహనాల కార**ణంగా ప**గటివేళే రాకపోకలు **సాగించడా**నికి కష్టంగా ఉం**టోంది.** నిమిషానికి వందల **సంఖ్యలో** వాహనాలు రయ్‌మని దూసుకుపోతు**న్నందున రో**డ్లు దాటాలన్నా సమస్యే. అలాంటిది **రాత్రి వేళ** విద్యుద్దీపాలు వెలగకపోతే ఎలా?

– చెల్లపల్లి కోదండరావు, పెదనాగమయ్యపాలెం

గ్రామాలు ఉన్నచోటా చీకటే..



హైవేకు ఇరువైపులా గ్రామా**లు, హోటళ్లు**, దాబాలు, పెట్రో**ల్ బంకులు** ఉన్న చోట కూడా **విద్యుద్దీపాలు** లేకపోతే వాహ**నాల రాకపో**కలు కష్టం. ఒక్కో**సారి వాహ**నాలు ప్రమాదాలకు గురైనప్పుడు సర్వీ**స్‌రోడ్డు** మీదుగా సమీప గ్రామాలలోకి **వాహనాలు** చొచ్చుకు వస్తుంటాయి.

– బల్లా వెంకటరావు, చిట్టివలస

వాహనాలు సాఫీగా వెళ్లే పరిస్థితి ఉండాలి



ఎత్తుపల్లాలు, మలుపుల కారణంగా వేగంగా వచ్చే వాహనాలు ఒక్కోసారి నియంత్రణ కోల్పోతున్నాయి. పగలు కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాంటిది రాత్రి ప్రయాణానికి ఇంకా ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి. లైట్లు ఉంటే రాకపోకలు సాఫీగా సాగుతాయి. – **నందిక రాము, తగరపువలస**

అతిథి అధ్యాపకులకు ఆహ్వానం

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోధించడానికి ఇద్దరు అతిథి అధ్యాపకులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ సోమవారం తెలిపారు. అర్థశాస్త్రం, రసాయన శాస్త్రంలో బోధించడానికి అభ్యర్థుల అవసరముందని పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఈ సబ్జెక్ట్‌లలో 55శాతం మార్కులు సాధించి ఉండాలని తెలిపారు. అలాగే సెట్, నెట్, పీహెచ్‌డీలో అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గలవారు తమ ధ్రువీకరణ పత్రాలతో వచ్చే 11వ తేదీ ఉదయం పది గంటలకు కళాశాలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 8179780917, 9848632130 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి దామోదర దీపోత్సవం



శ్రీరాధా మదన్ మోహనులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం చైతన్య భవన్‌లో మంగళవారం నుంచి నవంబరు 5 వరకు దామోదర దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి అంబరీష దాస తెలిపారు. దామోదర మాసం సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ సాయంత్రం 7 గంటల నుంచి 8.30 వరకు హారతి, సంకీర్తన, ప్రవచనం, దామోదర హారతి, దామోదర అష్టకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్‌చే అందించే నెయ్యి దీపాలతో భక్తులు స్వయంగా దామోదర కృష్ణునికి హారతి ఇచ్చే సదుపాయం కల్పించామన్నారు. భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రేషన్ కోసం పడిగాపులు



సాగర్‌నగర్‌లో తెరుచుకోని రేషన్ డిపో



రేషన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

కొమ్మాది: కూటమి ప్రభుత్వంలో ప్రజలకు రేషన్ కష్టాలు తప్పడం లేదు. ఒక్కో చోట డిపోలు మూసివేస్తుంటే, మరో చోట బియ్యం నిల్వ లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్, ఎండాడ రేషన్ డిపోలు మూసివేశారు. ఈ డిపోల్లో బియ్యం లేకపోవడంతో మూసివేశామని డీలర్లు తెలిపారు. డిపోలు మూసివేయడంతో, తెరుస్తారనే ఆశతో గంటల తరబడి లబ్ధిదారులు రోడ్డుమీదే వేచి ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికి రేషన్ వచ్చేదని, నేడు దూరప్రాంతాల నుంచి ఆటోకు డబ్బులు ఇచ్చి డిపోలకు వస్తున్నామని, కానీ రేషన్ లేదని చెపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ బాణసంచా నిల్వలపై కొరడా



ఆనందపురంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణసంచా

తగరపువలస: అనుమతి లేకుండా బాణసంచా తయారీ, విక్రయాలు చేస్తున్న వారిని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకుని, కేసులు నమోదు చేశారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఉత్తర్వుల మేరకు భీమిలి, ఆనందపురం, పద్మనాభం పోలీస్ స్టేషన్ల పరిధిలో సిబ్బంది సోమవారం తనిఖీలు నిర్వహించారు. వీరిలో భీమిలి ఎగువపేటకు చెందిన బాడితబోయిన గంగాధర్, ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం గ్రామానికి చెందిన లక్ష్మి, నేలేరు గ్రామానికి చెందిన దాసరి దేముడు, పద్మనాభం మండలం అర్చకుల వానిపాలెం గ్రామానికి చెందిన గేదెల రమణ ఉన్నారు. పోలీసులు మాట్లాడుతూ అనుమతులు లేకుండా దుకాణాల ఏర్పాటు, బాణసంచా నిల్వలపై నేరుగా 100, 112, 7995095799 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

భీమిలిలో బాణసంచా స్వాధీనం

భీమునిపట్నం: భీమిలిలో నిబంధనలకు విరుద్ధంగా ఇంట్లో నిల్వ ఉంచిన బాణసంచాను సోమవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ గ్రామ దేవత నూకాలమ్మ ఆలయం సమీపంలో బాడితబోయిన గంగాధర్ అనే వ్యక్తి ఇంట్లో బాణసంచా ఉన్నట్టు తెలియడంతో పోలీసులు సోదా చేయగా, రూ.8 వేల విలువగల బాణసంచా దొరికింది. వాటిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతుడు శివప్రసాద్

పీఎం పాలెం: ఓ వ్యక్తి అనుమానాస్పద మృతిపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. మన్యం పార్వతీపురం జిల్లా బాలగుడబ గ్రామానికి చెందిన ముమ్వల శివప్రసాద్ (54) భార్య పద్మజతో పీఎం పాలెం రామాలయం సమీపంలోని ఎల్ఐజీ క్వార్టర్స్‌లో నివసిస్తున్నారు. ఈయన ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నారు. శివప్రసాద్ ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు స్వగ్రామానికి వెళ్తున్నానని భార్యకు చెప్పి, ఇంటి వద్ద బయల్దేరారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు రామాలయం సమీపంలోని కల్వర్టు కింద మృత దేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. స్థానికంగా కలకలం రేగడంతో సంఘటన స్థలంలో పరిశీలించి, చనిపోయిన వ్యక్తి తన భర్త శివప్రసాద్‌గా పద్మజ గుర్తించింది. తన భర్త మరణంపై అనుమానం ఉందని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతుడు మద్యం వ్యసనపరుడని, సొంత ఊరులోని ఆస్తిపాస్తులు అమ్ముకున్నాడని పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు చిట్టివలస విద్యార్థులు



రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం ఆదినారాయణ, ఫిజికల్ డైరెక్టర్లు

తగరపువలస: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీలకు చిట్టివలస జెడ్పీ హైస్కూల్ నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు డి.ఆదినారాయణ సోమవారం తెలిపారు. వీరిలో ఇటీవల గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో జరిగిన అండర్–17 బాలుర రెజ్లింగ్ పోటీలలో పదో తరగతికి చెందిన 80 కిలోల విభాగంలో ఎస్.శశిధర్, 110 కిలోల విభాగంలో ఇ.దరహాస్, బాలికల 46 కిలోల విభాగంలో వి.ఈక్షిత, 43 కిలోల విభాగంలో బి.ఆదిలక్ష్మి ఎంపికయ్యారు. అలాగే, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన అండర్–14 ఫుట్‌బాల్ పోటీలలో 9వ తరగతి విద్యార్థిని జి.గీతాశ్రీ కూడా రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు ఫిజికల్ డైరెక్టర్లు వి.అచ్యుతరావు, బి.అప్పలరాజును ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ ప్రతినిధులు అభినందించారు.

గిరిజన భాషల నిఘంటువులపై వర్క్‌షాప్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టీసీఆర్‌టీఎం ఈడీ డా.రాణి

కొమ్మాది: ఆరు గిరిజన భాషల చిత్ర పదకోశం (నిఘంటువుల) అభివృద్ధిపై 5 రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్ రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణ మిషన్ (టీసీఆర్‌టీఎం) భవన్‌లో సోమవారం ప్రారంభమైంది. టీసీఆర్‌టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.రాణి మందా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సవర, కొండ, కువి, ఆదివాసి ఒరియా, కోయ, సుగాలి తదితర ఆరు గిరిజన భాషల నిఘంటువుల అభివృద్ధిపై ప్రొఫెసర్ డా.నాగరాజు, దుపుకొంట్ల రమేష్ భూషణ్, సీఐఐఎల్ భాషా శాస్త్రవేత్త మైసూర్ పర్యవేక్షణలో 5 రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టీఆర్ఐ దేశంలో పిక్టోరియల్ గ్లోసరీ అభివృద్ధితో అగ్రగామిగా ఉందని చెప్పారు. పిక్టోరియల్ గ్లోసరీ గిరిజన విద్యార్థుల్లో వారి సొంత భాషలో పదనిధిని సమర్థవంతంగా పెంచుతుందని వివరించారు.

కత్తితో దాడి చేసి గాయపరిచిన ఇద్దరికి రిమాండ్



మెడ, చెంపపై గాయాలతో అప్పలనాయుడు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ యాతపేటలో కుటుంబ సభ్యుల మధ్య జరిగిన తగాదాలో చుక్క అప్పలనాయుడు(64)పై కత్తితో దాడి చేసి, తీవ్రంగా గాయపరచిన చుక్క జగదీష్, చుక్క అప్పలరాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ వాసునాయుడు తెలియజేసిన వివరాలివి.. ఈ నెల 4న గ్రామంలో దుర్గాదేవి నిమజ్జనోత్సవం సందర్భంగా చుక్క అప్పలరాజు, చుక్క కార్తీక్ మధ్య వివాదం చోటు చేసుకుంది. దీనిని మనసులో పెట్టుకుని మరుసటి రోజు వీధిలో నుంచి వెళ్తున్న కార్తీక్‌పై అప్పలరాజు, జగదీష్ కత్తితో దాడికి ప్రయత్నించారు. ఆ సమయంలో అదే మార్గంలో వెళ్తున్న కార్తీక్ పెదనాన్న అప్పలనాయుడు వారించగా నిందితులు ఆయన మెడ, చెంపపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. క్షతగాత్రుని చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. ఈ సంఘటనపై కార్తీక్ సోమవారం ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జి.సంతోష్ ఇద్దరినీ అరెస్ట్ చేసి భీమిలి న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా, 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పద్మనాభం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో కె.రూపేష్ సూచించారు. మండలంలోని కృష్ణాపురంలో సోమవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రోడ్లపై చెత్త వేయకూడదని, ఇళ్లలోని మురికి నీటిని రోడ్డుపై విడిచి పెట్టకూడదని తెలిపారు. కాలనీ లేఅవుట్‌ను పరిశీలించారు. అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరితగతిన కాలనీ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. కృష్ణాపురం గ్రామంలో మురుగుకూపంగా మారిన రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.లక్ష్మీ భవాని, గృహ నిర్మాణ శాఖ ఏఈ పద్మజ పాల్గొన్నారు.

జోన్–2 పీజీఆర్ఎస్‌కు 15 అర్జీలు



సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్–2 కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 15 అర్జీలు వచ్చాయి. జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జోన్ పరిధిలోని 9 వార్డుల్లోని వివిధ ప్రాంతాల నుంచి టౌన్ ప్లానింగ్–4, ఈఈ వర్క్స్–3, వాటర్ సప్లై–2, రెవెన్యూ–1, పబ్లిక్ హెల్త్–3, యూసీడీ, యూజీడీ విభాగాల నుంచి ఒక్కొక్కటి చొప్పున మొత్తంగా 15 అర్జీలు వచ్చినట్టు ఆమె తెలిపారు.

జోన్–1కు నాలుగు దరఖాస్తులు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు నాలుగు వినతులు వచ్చాయి. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి నాలుగు వినతులు రాగా, వాటిని పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

ఆయుష్ ఆస్పత్రికి జిల్లా స్థాయి పురస్కారం



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న వైద్యురాలు సుమ



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచ్‌లు ఛాయాగౌతమి, పార్వతమ్మ

మధురవాడ: స్వచ్ఛాంధ్ర అవార్డుల్లో మధురవాడ ఆయుష్ ఆస్పత్రికి మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో జిల్లా స్థాయి ఉత్తమ పురస్కారం లభించింది. విశాఖలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఆర్‌డీడీ శ్రీనివాసులు చేతులు మీదుగా వైద్యురాలు మజ్జి సుమ ఈ అవార్డును అందుకున్నారు.

స్వచ్ఛాంధ్ర అవార్డుల స్వీకరణ

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం, వేములవలస, గంభీరం, భీమిలి మండలంలోని టి.నగరపాలెం పంచాయతీలకు స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ జిల్లా స్థాయి పురస్కారాలు లభించాయి. కలెక్టర్ హరేందిర ప్రసాద్ నుంచి సర్పంచ్‌లు, గ్రీన్ అంబాసిడర్లు ఈ అవార్డులు స్వీకరించారు. టి.నగరపాలెం సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, చంద్రశేఖర్, పెద్దిపాలెం సర్పంచ్ బావిశెట్టి పార్వతమ్మ అవార్డులు స్వీకరించిన వారిలో ఉన్నారు

యూరియా కోసం రైతుల ప్రదక్షిణలు

తగరపువలస: పద్మనాభం మండలం రేవిడి పంచాయతీకి చెందిన రైతులు వారం రోజులుగా యూరియా కోసం రైతు సేవా కేంద్రం చుట్టు ప్రదక్షిణ చేస్తూనే ఉన్నారు. వాస్తవానికి పది రోజుల క్రితమే ఈ కేంద్రంలో యూరియా అన్‌లోడ్ చేసినా, వ్యవసాయాధికారులు విక్రయించడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రతిరోజూ రైతు సేవా కేంద్రం వద్దకు రావడం.. అధికారులు ఎవరూ కనిపించకపోవడం, తాళాలు తెరవకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరగడం జరుగుతోంది. ఉడుపులు ముగిసినా యూరియా వేయని కారణంగా మొక్కలలో ఎదుగుదల లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతోనే సకాలంలో యూరియా సరఫరా కాకపోవడం, పంపిణీలో అధికారుల అలసత్వం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియా, ఎరువులు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలి

కొమ్మాది: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ర్యాంకులు, మార్కులపైనే కాకుండా విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని జిల్లా కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సెలర్ దొడ్ల ఝాన్సీరాణి సూచించారు. 8వ వార్డు ఎండాడలోని జిల్లాపరిషత్ హైస్కూల్లో సోమవారం నిర్వహించిన ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఆందోళనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. పిల్లల మానసిక ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు

తగరపువలస: చిట్టివలసలో గురుస్వామి ఆకెళ్ల నరసింహమూర్తి ఇంటి వద్ద మూడు రోజులుగా జరుగుతున్న శ్రీఅరుణాచలేశ్వరస్వామి సహిత హరిహరపుత్ర అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. అర్చకులు ఆకెళ్ల భాగ్యరాజ్, రవిగణేశ్ శర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాల అర్చనలు, శాంతిహోమాలు, గర్భాలయ ప్రవేశం, యంత్రస్థాపన, విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట, పూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, సాయంత్రం మహా పడిపూజ నిర్వహించారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖలు ప్రారంభం



బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ నికేష్‌కుమార్ సిన్హా

విశాఖ సిటీ: బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖలో రెండు కొత్త శాఖలు ప్రారంభమయ్యాయి. మారికవలస, తగరపువలస ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రాంచ్‌లను బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ నికేష్‌కుమార్‌సిన్హా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, వ్యాపారులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే బ్యాంక్ ఆఫ్ ఇండియా లక్ష్యమన్నారు. ఈ విస్తరణ అత్యుత్తమ బ్యాంకింగ్ సేవలు అందించడమే కాకుండా ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. బ్యాంక్ డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎస్.సీతారాం మాట్లాడుతూ డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరు సహా అన్ని రకాల సేవలు ఈ కొత్త శాఖల్లో అందుబాటులో ఉంటాయన్నారు. బంగారం తాకట్టు, పంట, ముద్ర రుణాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి నాగేష్, బ్యాంక్ అధికారులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.